సాక్షి అనంతపురం

గురువారం । 12 । డిసెంబర్ । 2024



చీనీ టన్ను రూ.38,290

అనంతపురం మార్కెట్‌యార్డులో బుధవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.38,290 పలికాయి.



టమాట కిలో రూ.16

అనంతపురం కక్కలపల్లి మండీలో బుధవారం కిలో టమాట గరిష్ట ధర రూ.17 పలికింది. కనిష్టం రూ.7, సరాసరి రూ.12 ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.

గరిష్టం/కనిష్టం
35.6°/18.5°

జిల్లా అంతటా బుధవారం పగటి ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. చలి వాతావరణం నెలకొంది. ఆగ్నేయం దిశగా గంటకు 6 నుంచి 8 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

న్యూస్‌రీల్

భోజనంలో నాణ్యత లోపిస్తే చర్యలు



భోజన ఏజెన్సీ నిర్వాహకులతో మాట్లాడుతున్న ఫుడ్ కమిషన్ చైర్మన్ విజయ ప్రతాప్ రెడ్డి

రాప్తాడు: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అందించే భోజనంలో నాణ్యత లోపిస్తే చర్యలు తప్పవని రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ విజయ ప్రతాప్ రెడ్డి హెచ్చరించారు. బుధవారం మండలంలోని ధర్మవరం పంగల్ రోడ్డు సమీపంలోని కేజీబీవీ పాఠశాల, గంగలకుంట గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రం, రాప్తాడులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలతో పాటు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. గంగలకుంట అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులకు పౌష్టికాహారం పంపిణీ చేశారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చారు రుచిగా లేకపోవడం, వెజిటేబుల్ పలావ్‌లో నాణ్యత లోపించడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పునరావృతమైతే భోజన ఏజెన్సీ నిర్వాహకులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. బాగా చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని విద్యార్థులకు సూచించారు. అనంతరం పీహెచ్‌సీని తనిఖీ చేసి, గ్రామీణులకు నాణ్యమైన వైద్యం అందించాలని వైద్య సిబ్బందికి సూచించారు. విధులను నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆయన వెంట ఐసీడీఎస్ పీడీ బి.ఎన్ శ్రీదేవి, సీడీపీఓ ధనలక్ష్మి, ఎంఈఓ మల్లికార్జున, హెచ్‌ఎం సాంబశివా, వైద్యాధికారి శివకృష్ణ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నాగరత్న తదితరులు పాల్గొన్నారు.

'మెగా సప్లి'ని సద్వినియోగం చేసుకోండి

అనంతపురం ఎడ్యుకేషన్: స్థానిక ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో 2016 నుంచి 2019 మధ్య డిగ్రీ చదివి వివిధ సబ్జెక్టుల్లో ఫెయిల్ అయిన విద్యార్థులు మెగా సప్లిమెంటరీ పరీక్షలను సద్వినియోగం చేసుకోవాలని ప్రిన్సిపాల్ డాక్టర్ పి.పద్మశ్రీ సూచించారు. ఈ మేరకు బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. హాల్ టికెట్ నంబరు 17, 18, 19 సిరీస్‌తో మొదలైన విద్యార్థులందరూ సప్లిమెంటరీ పరీక్షలు రాసుకునేందుకు అర్హులని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు కళాశాలలోని పరీక్షల విభాగంలో సంప్రదించాలని సూచించారు.

విధులకు డుమ్మా

- 9 మంది వైద్య సిబ్బందికి మెమోలు

శింగనమల: విధులకు డుమ్మా కొట్టిన 9 మంది వైద్య సిబ్బందికి మెమోలు జారీ అయ్యాయి. శింగనమల సీహెచ్‌సీని డీసీహెచ్‌ఎస్ పాల్ రవి కుమార్ బుధవారం ఉదయం ఆకస్మిక తనిఖీ చేశారు. పలువురు సిబ్బంది సక్రమంగా విధులకు హాజరుకావడం లేదని, రాత్రి డ్యూటీలు సక్రమంగా నిర్వహించడం లేదని గుర్తించారు. ఈ క్రమంలోనే 9 మందికి మెమోలు జారీ చేశారు. సీహెచ్‌సీలో వైద్య సిబ్బంది లేకపోవడంతో రోగులు డీసీహెచ్‌ఎస్‌కు ఫోన్ ద్వారా ఫిర్యాదు చేశారు.

చంద్రబాబు నేతృత్వంలోని కూటమి సర్కారు అమలులోకి తెచ్చిన బీమా పథకంలో చేరడానికి రైతులు ఆసక్తి చూపించడం లేదు. గత ఐదేళ్లు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సర్కారు పైసా కూడా మోపకుండా సాగు చేసిన పంటలన్నింటికీ బీమా వర్తింపజేయడంతో రైతులకు ఎలాంటి ఇబ్బందులూ ఎదురుకాలేదు. అలాంటి ఉచిత బీమాను రద్దు చేసి రైతులు డబ్బు చెల్లించాలని కూటమి సర్కారు షరతు పెట్టి పెద్ద భారం మోపింది.

అన్నదాతలపై.. బీమా బండ



- రైతులపై కనికరం చూపని కూటమి సర్కారు
- మోయలేని విధంగా ప్రీమియం భారం
- పంటల నమోదుకు ఆసక్తి చూపని 'రబీ' రైతులు
- ఇప్పటికి 15 శాతం మంది మాత్రమే నమోదు
- 15తో ముగియనున్న గడువు
- గత ఐదేళ్లు ఉచితంగా అమలు చేసి ఆదుకున్న వైఎస్ జగన్ ప్రభుత్వం

అనంతపురం అగ్రికల్చర్: పంటల బీమా పథకాలు రైతుల పాలిట గుదిబండగా మారాయి. వాతావరణ ఆధారిత బీమా, ప్రధానమంత్రి ఫసల్‌బీమా పథకాల కోసం పెద్ద మొత్తంలో ప్రీమియం చెల్లించినా వివిధ కారణాలతో గతంలో పరిహారం అందలేదు. దీంతో అన్నదాతలు నేడు తమ వాటా చెల్లించకుండా మిన్నకుండిపోతున్నారు.

భరించలేని భారం..

ప్రస్తుత రబీలో వాతావరణ, ఫసల్ బీమా కింద పప్పుశనగ, వేరుశనగ, జొన్న, మొక్కజొన్న, వరి, టమాట, మామిడి పంటలకు బీమా వర్తింపజేశారు. ఇందులో వ్యవసాయ పంటలకు రైతులు తమ వాటా కింద 1.5 శాతం, అలాగే మామిడి, టమాటకు 5 శాతం మేర ప్రీమియం చెల్లించాల్సి ఉంటుంది. అంటే పప్పుశనగ రైతులు ఎకరాకు రూ. 450, వేరుశనగ రైతులు ఎకరాకు రూ.480, జొన్న రైతులు ఎకరాకు రూ.315, మొక్కజొన్న రైతులు ఎకరాకు రూ.525, వరి రైతులు ఎకరాకు రూ.630, టమాట రైతులు ఎకరాకు రూ.1,600, మామిడి రైతులు ఎకరాకు రూ.1,650 ప్రకారం ప్రీమియం చెల్లించాల్సి ఉంటుంది. ఈనెల 15లోపు వాటా చెల్లిస్తేనే బీమా పథకం వర్తిస్తుందని ప్రకటించారు. 10 ఎకరాలున్న మామిడి రైతులపై రూ.16 వేల వరకు ప్రీమియం భారం పడనుంది. ఇలా అన్ని పంటలకు పెద్ద మొత్తంలో చెల్లించాల్సి రావడంతో రైతులు ఆసక్తి కనబరచడం లేదు. అది కూడా బ్యాంకులు, మీ–సేవ కేంద్రాలు, కామన్‌సర్వీసు సెంటర్లు, బీమా పోర్టల్‌కు వెళ్లి అన్ని డాక్యుమెంట్లు సమర్పించాల్సి ఉండటంతో వాటి చుట్టూ తిరగడానికి కూడా అన్నదాతలు ఇబ్బంది పడుతున్నారు.

ఇప్పటికి 15 శాతమే...

రబీలో అటు వాతావరణ బీమా, ఇటు ఫసల్‌బీమా కింద సుమారుగా లక్ష మంది వరకు రైతులు 69,230 హెక్టార్లకు బీమా ప్రీమియం చెల్లిస్తారని అధికారికంగా అంచనా వేశారు. కానీ ఇప్పటి వరకు 15 శాతం మంది మాత్రమే బీమా పరిధిలోకి వచ్చారు. కేవలం 5,900 మంది రైతులు 9,500 హెక్టార్లకు ప్రీమియం చెల్లించారు. ప్రీమియం చెల్లింపునకు ఈనెల 15 వరకూ గడువు ఉంది. అయితే, నాలుగు రోజుల్లో మిగిలిన 85 శాతం మంది బీమా పరిధిలోకి రావడం కష్టమంటున్నారు. రైతులను బురిడీ కొట్టించేలా కూటమి సర్కారు బీమా పథకాలు అమలు చేస్తుండగా ప్రభుత్వానికి తమవంతు సహకారంగా వ్యవసాయశాఖ అధికారులు కూడా అదే దారిలో సాగుతున్న పరిస్థితి నెలకొంది. దీంతో ప్రధానంగా పప్పుశనగ రైతులకు అన్యాయం జరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి.

గత ఐదేళ్లు ఉచితం..

గత ఐదేళ్లు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అటు ఖరీఫ్, ఇటు రబీలో ఉచితంగా వాతావరణ, ఫసల్‌బీమా పథకాలు అమలు చేసింది. దీంతో రైతులు ఎలాంటి సమస్య లేకుండా బీమా పరిధిలోకి వచ్చారు. సాగు చేసిన పంటలను ఈ–క్రాప్, ఈ–కేవైసీ చేయించుకుంటే చాలు బీమా వర్తింపజేసి నిబంధనల మేరకు పరిహారం కూడా సకాలంలో ఇచ్చిన విషయాన్ని రైతులు గుర్తు చేసుకుంటున్నారు. గత ప్రభుత్వ హయాంలో తొలిసారిగా ఉద్యాన పంటల రైతులకు కూడా పెద్ద మొత్తంలో పరిహారం అందించారు. గత ఐదేళ్ల కాలంలో విస్తారంగా వర్షాలు కురిశాయి. పంట దిగుబడులు కూడా బాగానే వచ్చాయి. అయినా నిబంధనల మేరకు ఉచిత పంటల బీమా పథకం కింద 14.20 లక్షల మంది రైతుల ఖాతాల్లోకి ఏకంగా రూ.1,883 కోట్లు జమ చేయడం గమనార్హం.

రైతులపై చంద్రబాబు చిన్నచూపు



రైతులను సీఎం చంద్రబాబు చిన్నచూపు చూస్తున్నారు. పంటల బీమా ప్రీమియంతో పెనుభారం మోపుతున్నారు. అన్నదాత సుఖీభవ, ఇన్‌పుట్, ఇన్సూరెన్స్ ఇవ్వకుండా దగా చేస్తున్నారు. గత ఐదేళ్లు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఉచితంగా పంటల బీమా అమలు చేసి, రైతులకు పెద్ద మొత్తంలో పరిహారం కూడా అందించింది. – **అనంత వెంకట రామిరెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షులు**

మంచి పద్ధతి కాదు



ఖరీఫ్‌లో 2 శాతం, రబీలో 1.5 శాతం, ఉద్యాన పంటలకు 5 శాతం ప్రీమియం చెల్లించాలని రైతులపై భారం వేయడం సమంజసం కాదు. మీ–సేవ కేంద్రాలు, కామన్ సర్వీసు సెంటర్ల చుట్టూ తిరిగేలా రైతులను ఇబ్బంది పెట్టడం మంచిది కాదు. బీమా పథకాలపై రైతుల్లో అనాసక్తి పెంచేలా చంద్రబాబు ప్రభుత్వం వ్యవహరిస్తోంది.

– **చంద్రశేఖర్‌రెడ్డి, ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి**

సంక్షోభంలో వ్యవసాయ రంగం



సర్కారు నిర్లక్ష్యంతో రాష్ట్రంలో వ్యవసాయ రంగం సంక్షోభంలో కూరుకుపోతోంది. ఇలాంటి తరుణంలో కరుణ చూపాల్సింది పోయి బీమా ప్రీమియం కట్టాలంటూ గుదిబండ మోపడం దారుణం. రైతులకు అండగా ఉండేందుకు వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో ఈ నెల 13న జరిగే ర్యాలీలో అందరూ పాల్గొని విజయవంతం చేయాలి.

–**ఎస్వీ నారాయణ, వైఎస్సార్ సీపీ రైతు విభాగం జిల్లా అధ్యక్షుడు**

వీరుడా వందనం

- వీర జవాన్ సుబ్బయ్య భౌతికకాయానికి ఘన నివాళి
- తరలివచ్చిన జనం



వీర జవాన్ సుబ్బయ్య భౌతికకాయానికి నివాళులర్పించేందుకు తరలివచ్చిన జనం

నార్పల: తోటి జవాన్లు 30 మందిని కాపాడి వీర మరణం పొందిన జవాన్ వరికుంట్ల సుబ్బయ్య భౌతికకాయం బుధవారం రాత్రి మండల కేంద్రం చేరుకుంది. సుబ్బయ్య భౌతికకాయాన్ని నార్పల క్రాసింగ్ నుంచి పోలీస్ ఎస్కార్ట్ నడుమ ర్యాలీగా నార్పలలో ఆయన నిర్మించుకున్న కొత్త ఇంటికి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా భౌతికకాయానికి నివాళులర్పించేందుకు జనం తరలివచ్చారు. ర్యాలీలో జోహార్ సుబ్బయ్య అంటూ నినాదాలు చేశారు. సుబ్బయ్య కుటుంబసభ్యులను ఉమ్మడి జిల్లా సైనిక సంక్షేమ అధికారి పి.తిమ్మప్ప పరామర్శించి, ధైర్యం చెప్పారు. మద్రాస్ సైనిక సంక్షేమ శాఖ, రెజిమెంట్ నుంచి ఫ్యామిలీ పెన్షన్, ఇతర ఆర్థిక సాయాన్ని త్వరగా అందేలా చర్యలు తీసుకుంటామని భరోసా ఇచ్చారు.



సుబ్బయ్య భౌతికకాయం భద్రపరిచిన పెట్టె

వైఎస్సార్‌సీపీ నాయకులు, అనంతపురం మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ నార్పల సత్యనారాయణరెడ్డి వీర జవాన్ సుబ్బయ్య కుటుంబసభ్యులకు ధైర్యం చెప్పారు. గురువారం ఉదయం 8 గంటలకు సుబ్బయ్య తోటలో అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు కుటుంబసభ్యులు తెలిపారు.

సాగునీటి సంఘాల ఎన్నికలకు నోటిఫికేషన్

అనంతపురం సెంట్రల్: సాగునీటి సంఘాల ఎన్నికలకు గెజిట్ నోటిఫికేషన్‌ను కలెక్టర్ వినోద్ కుమార్ విడుదల చేశారు. ఈ నెల 14న జిల్లాలో మధ్య, చిన్న తరహా ప్రాజెక్ట్ కమిటీలకు ఎన్నికలు నిర్వహించనున్నారు. 17న మేజర్ ఇరిగేషన్ సిస్టమ్స్ (హెచ్‌ఎల్‌ఎంసీ, మిడ్‌పెన్నార్ సౌత్ కెనాల్, నార్త్ కెనాల్, తాడిపత్రి బ్రాంచ్ కెనాల్, గుంతకల్లు బ్రాంచ్ కెనాల్, ఆలూరు బ్రాంచ్ కెనాల్) ఎన్నికలు జరగనున్నాయి.

ఖైదీ పరారీ

సాక్షి, పుట్టపర్తి: పోలీసుల కళ్లు కప్పి రిమాండ్ ఖైదీ పరారైన ఘటన శ్రీసత్యసాయి జిల్లా పెనుకొండలో చోటు చేసుకుంది. ఓ ఇంటి స్థల వివాదంలో చిక్కుకుని రిమాండ్ ఖైదీగా ఉన్న రవీంద్ర నాయక్‌ను బుధవారం కోర్టుకు హాజరు పరిచేందుకు పోలీసులు పెనుకొండకు తీసుకువచ్చారు. మూత్ర విసర్జనకు వెళ్లొస్తానంటూ పత్తా లేకుండా పోయాడు. పెనుకొండ మండలం అడదాకులపల్లిలో మూడు నెలల క్రితం ఇంటి స్థలం విషయంలో రవీంద్రనాయక్, శంకర్‌నాయక్ గొడవ పడ్డారు. శంకర్‌నాయక్ ఫిర్యాదు మేరకు రవీంద్ర నాయక్, ఆయన కుమారుడు పృథ్వీనాయక్‌ను పోలీసులు అరెస్ట్ చేసి, రిమాండ్‌కు తరలించారు.

వైభవంగా దర్గాహొన్నూరు స్వామి ఉరుసు



దర్గాహొన్నూరు స్వామి ఆలయం వద్ద భక్తుల కోలాహలం (ఇన్‌సెట్) ప్రత్యేక అలంకరణలో స్వామివారు

వజ్రకరూరు: మండల పరిధిలోని చాబాల గ్రామంలో భక్తుల కొంగుబంగారం దర్గాహొన్నూరు స్వామి ఉరుసు వేడుకలు బుధవారం అంగరంగ వైభవంగా జరిగాయి. ఉదయం ఆలయంలో స్వామివారికి విశేష పూజలు నిర్వహించారు. సాయంత్రం కొమ్మే పెద్దకుళ్లాయప్ప ఇంటి నుంచి నిర్వహించిన షంషేర్ ఊరేగింపులో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ఆలయంలో భక్తిశ్రద్ధలతో చక్కెర చదివింపులు చదివించి మొక్కులు తీర్చుకున్నారు. ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి తనయుడు, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర నాయకుడు వై.భీమిరెడ్డి స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ నిర్వాహకులు ఆయనకు స్వామి వారి ప్రసాదాలు అందజేశారు. కాగా, ఉరుసు సందర్భంగా స్వామివారి ఆలయాన్ని విద్యుత్ దీపాలతో ప్రత్యేక అలంకరించారు. భారీగా అంగళ్లు వెలియడంతో సందడి నెలకొంది. ఆలయం వద్ద ఏర్పాటు చేసిన ఆర్కెస్ట్రా ఆకట్టుకుంది.

విద్యార్థుల భవిష్యత్తుతో ఆటలు

- ఫీజులకు, హాల్‌టికెట్లకూ మెలిక
- ఎస్కేయూ క్యాంపస్‌లో లా, పీజీ విద్యార్థులకు అవస్థలు
- పరీక్ష ఫీజు చెల్లించినా దరఖాస్తుల స్వీకరణకు నిరాకరణ
- నిధులు విడుదల చేయడంలో కూటమి సర్కారు విఫలం
- ఆందోళనలో విద్యార్థులు



రిజిస్ట్రార్ చాంబర్‌లో బైఠాయించిన ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు

అనంతపురం: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం క్యాంపస్‌లో ఎల్‌ఎల్‌బీ, పీజీ చదివే విద్యార్థుల భవిష్యత్తుతో ఉన్నతాధికారులు ఆటలాడుకుంటున్నారు. బకాయి పడ్డ మెస్‌బిల్లులు చెల్లిస్తేనే పరీక్ష దరఖాస్తులు తీసుకుంటామని స్పష్టం చేయడంతో ఎటూపాలుపోని స్థితిలో విద్యార్థులు ఉన్నారు. పైసా బకాయి ఉన్నా పరీక్షలకు అనుమతించబోమని పేర్కొనడంతో విద్యార్థులకు దిక్కుతోచడం లేదు.

దరఖాస్తుల స్వీకరణకు నో

ఎల్‌ఎల్‌బీ రెండు, నాలుగో సెమిస్టర్ పరీక్షలు త్వరలో నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించిన నోటిఫికేషన్‌ను ఇప్పటికే విడుదల చేశారు. ఈ క్రమంలో పరీక్ష ఫీజులను చలానా రూపంలో బ్యాంకులో చెల్లించిన విద్యార్థులు.. దరఖాస్తు అందించడానికి ప్రిన్సిపాల్ కార్యాలయానికి వెళితే తీసుకోవడానికి నిరాకరిస్తున్నారు. మెస్ బకాయిలు చెల్లిస్తేనే దరఖాస్తులు స్వీకరించాలంటూ ఉన్నతాధికారులిచ్చిన ఆదేశాలను అనుసరిస్తున్నామని పేర్కొంటున్నారు. ఎల్‌ఎల్‌బీ రెండో సెమిస్టర్ 79 మంది, నాలుగో సెమిస్టర్ 54 మంది విద్యార్థులు రాయనున్నారు. త్వరలో పీజీ సెమిస్టర్ పరీక్షలకు సంబంధించిన నోటిఫికేషన్ జారీ చేయనున్నారు. వీరికి సైతం ఇవే నిబంధనలు వర్తిస్తాయని అధికారులు స్పష్టం చేయడం గమనార్హం.

జీఓ ఇచ్చినా..

కూటమి ప్రభుత్వం ఏర్పడి ఆరు నెలలవుతున్నా విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్, వసతి దీవెన మొత్తాలను విడుదల చేయలేదు. దీంతో కళాశాలల యాజమాన్యాలు పరీక్షలకు అనుమతించకపోవడంతో రాష్ట్ర వ్యాప్తంగా విద్యార్థులు ప్రభుత్వానికి ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలోనే చంద్రబాబు సర్కారు ఆగమేఘాల మీద జీఓ జారీ చేసింది. ఫీజు, మెస్ బిల్లు చెల్లించకపోయినా పరీక్షలకు అనుమతించాలని ఆదేశించింది. వీటిని అనుసరించి జిల్లా కలెక్టర్ సర్క్యులర్ జారీ చేశారు. అయినప్పటికీ శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయ యాజమాన్యం తమకేమీ పట్టనట్టు వ్యవహరిస్తుండటంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. బకాయిలు చెల్లించకపోతే హాస్టళ్ల నిర్వహణ కష్టతరమంటూ చెప్పడంపై విద్యార్థులు తీవ్రంగా మండిపడుతున్నారు.

రిజిస్ట్రార్ ఘెరావ్..

విద్యార్థులపై ఫీజుల వేధింపులు ఆపాలంటూ బుధవారం రిజిస్ట్రార్ కార్యాలయంలో ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి ఓతురు పరమేష్ మాట్లాడుతూ వీసీ, రిజిస్ట్రార్‌లు విద్యార్థుల నుంచి ఫీజులు వసూలు చేసే పనిలో నిమగ్నం కావడం గర్హనీయమన్నారు. ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు ఇవ్వలేదని గుర్తు చేశారు. ప్రభుత్వం చెల్లించాల్సిన బకాయిలతో తమకు సంబంధం లేదనడం భావ్యం కాదన్నారు. విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ చెబుతున్న మాటలు నీటి మూటగానే మిగిలిపోయిందని విమర్శించారు. పైకి ఆదేశాలు ఇస్తూ క్షేత్రస్థాయిలో బకాయిలు వసూలు చేయాలని మంత్రి చెప్పినట్లు దీన్ని బట్టి అర్థమవుతోందన్నారు. తీరు మార్చుకోకపోతే ఉద్యమాలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ వర్సిటీ అధ్యక్ష, కార్యదర్శి వంశీ, శివా రెడ్డి, జిల్లా సహాయ కార్యదర్శి భీమేష్, వీరు, నాయకులు మోహన్, చంద్రనాయక్, గణేష్, హరీష్, విష్ణు, ఎర్రిస్వామి, రాముడు, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

త్వరలో మరో 'వందేభారత్'!

- విజయవాడ– బెంగళూరు మధ్య రాకపోకలు



అనంతపురం సిటీ: జిల్లా మీదుగా త్వరలో మరో వందేభారత్ రైలు నడవనున్నట్లు తెలిసింది. విజయవాడ–బెంగళూరు వయా అనంతపురం మీదుగా ప్రారంభానికి సన్నాహాలు జరుగుతున్నట్లు రైల్వే వర్గాలు తెలిపాయి. తెలుగు రాష్ట్రాల్లో వందేభారత్‌కు ప్రాధాన్యం పెరుగుతోంది. ఇప్పటికే కాచిగూడ–యశ్వంత్‌పూర్, కలబురిగి–బెంగళూరు వయా అనంతపురం మీదుగా తిరిగే రెండు వందేభారత్ రైళ్లకు విశేష ఆదరణ లభిస్తోంది. దీంతో రైల్వే శాఖ అధికారులు కొత్తగా మరో 'వందేభారత్' నడిపేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు సమాచారం. గుంటూరు నుంచి పల్నాడు మీదుగా నంద్యాల, డోన్, గుంతకల్లు, అనంతపురం, హిందూపురం, యలహంకలో స్టాపులు ఉండేలా ప్రతిపాదించారు. రైల్వే శాఖ సాంకేతిక అంశాలపై నివేదిక కోరిందని, నెలాఖరులోగా దీనిపై అధికారిక ప్రకటన వెలువడే అవకాశముందని రైల్వే వర్గాలు తెలిపాయి. గుంటూరు నుంచి బెంగళూరుకు సుమారు 16 గంటల సమయం పడుతోంది. దీంతో ప్రయాణికులు, వివిధ వర్గాల వారు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నట్లు కేంద్ర రైల్వే మంత్రి దృష్టికి ప్రజాప్రతినిధులు తీసుకెళ్లారు. ఈ మార్గంలో కొత్త రైలు అవసరాన్ని వివరించారు. దీంతో రైల్వే మంత్రి సానుకూలంగా స్పందించినట్లు తెలుస్తోంది.

క్లుప్తంగా

అనంతలోనే రెండు కోర్టులు ఉండాలి



దీక్షలో పాల్గొన్న న్యాయవాద గుమస్తాలు

అనంతపురం: సీబీడీ కోర్టును కర్నూలులోని ఏసీబీ కోర్టుకు, ఎన్‌డీపీఎస్ కోర్టును తిరుపతికి బదలాయించేలా రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై న్యాయవాదులు చేపట్టిన ఆందోళనలు బుధవారం నాటికి ఏడో రోజుకు చేరుకున్నాయి. న్యాయస్థానాల బదలాయింపుపై జారీ చేసిన జీఓలను తక్షణమే రద్దు చేయాలంటూ బుధవారం న్యాయవాదులు, న్యాయవాద గుమాస్తాలు ఆందోళనలో పాల్గొన్నారు. కార్యక్రమంలో న్యాయవాదులు సి.హనుమన్న, నాగన్న, తదితరులు, న్యాయవాద గుమస్తాల అసోసియేషన్ సభ్యులు ఈ.మల్లికార్జున, వైస్ ప్రెసిడెంట్ ఎ.ఉదయభాస్కర్, వైస్ ప్రెసిడెంట్ ఎస్.షెక్షావలి, బాబా, బి.లక్ష్మీనారాయణ, డి.బాబావలి, శ్రీనాథ్, సత్య, వస్నూరు వలి పాల్గొన్నారు.

మహిళా కూలీ దుర్మరణం

బుక్కరాయసముద్రం: ట్రాక్టర్ పై నుంచి కింద పడి ఓ మహిళా కూలీ దుర్మరణం పాలైంది. పోలీసులు తెలిపిన మేరకు... బీకేఎస్ మండలం నీలాంపల్లికి చెందిన షకీనాబీ (33), హుస్సేన్ దంపతులకు ఇద్దరు కుమారులు ఉన్నారు. వ్యవసాయ కూలీ పనులతో జీవనం సాగిస్తున్నారు. ఈ క్రమంలో బుధవారం నీలాంపల్లికి చెందిన ఓ రైతు పొలంలో ట్రాక్టర్‌కు గడ్డి వేసే పనులకు షకీనాబీ వెళ్లింది. తోటలో ట్రాక్టర్ ట్రాలీలో గడ్డి నింపి దానిపై కూర్చొని ప్రయాణిస్తున్న ఆమె మార్గమధ్యంలో కుదుపులకు అదుపు తప్పి కిందపడి అక్కడికక్కడే మృతి చెందింది. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

భూ సమస్యలు పరిష్కరించుకోండి : డీఆర్వో



మాట్లాడుతున్న డీఆర్వో మలోలా

ఉరవకొండ: భూ సమస్యలను పరిష్కరించుకునేందుకు రెవెన్యూ సదస్సులు చక్కటి వేదిక అని, ఎవరైనా భూ సమస్యలతో ఇబ్బంది పడుతుంటే తక్షణమే రెవెన్యూ సదస్సుల్లో అర్జీలు ఇచ్చి పరిష్కరించుకోవాలని రైతులకు డీఆర్వో మలోలా పిలుపునిచ్చారు. ఉరవకొండ మండలం రాచెర్ల గ్రామంలో బుధవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సుకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై, మాట్లాడారు. భూ, ప్రజా సమస్యల పరిష్కారానికి ఈ సదస్సులు దోహద పడతాయన్నారు. అర్జీలు ఇచ్చిన ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా రసీదులు పొందాలన్నారు. అనంతరం ప్రజలు ఇచ్చిన పలు అర్జీలను పరిశీలించారు. కార్యక్రమంలో తహసీల్దార్ మహబూబ్ బాషా, డిప్యూటీ తహసీల్దార్ బోగన్నగౌడ్, ఆర్ఐ రామకృష్ణ, సర్వేయర్ రత్నాకర్ పాల్గొన్నారు.

ఊరంతా దుస్తులే!

- వస్త్ర వ్యాపారంలో రెండో ముంబయిగా 'పామిడి'
- నాణ్యమైన దుస్తులకు కేరాఫ్



తన ఇంటి వద్ద విక్రయానికి అనుకూలమైన దుస్తులను పరిశీలిస్తున్న వ్యాపారస్తురాలు

పామిడి: రాయలసీమ జిల్లాల్లోనే నాణ్యమైన వస్త్రాలకు ఖ్యాతి గాంచింది పామిడి. 65 వేల మంది జనాభా ఉన్న పామిడిలో 85 శాతం మంది వస్త్ర వ్యాపారంపైనే ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. ఏ వీధికెళ్లినా వస్త్ర దుకాణాలే కనిపిస్తాయి. కేవలం టెక్స్‌టైల్‌లోనే కాకుండా రెడీమేడ్ దుస్తుల తయారీలోనూ రెండో ముంబయిగా ఖ్యాతిగాంచింది.

గ్రామం ఆవిర్భావం నుంచే...

శతాబ్దాల క్రితం ఆవిర్భవించిన పామిడి గ్రామానికి పెద్ద చరిత్రనే ఉంది. పూర్వం పరశురాముడి స్వైర విహారం నుంచి తప్పించుకుని కుటుంబాలతో వలస వచ్చిన క్షత్రియులు పామిడి పెన్నానది ఒడ్డున సింగిరప్ప కొండపై స్థావరాన్ని ఏర్పాటు చేసుకున్నట్లు పూర్వీకులు చెబుతున్నారు. అనంతరం ప్రస్తుతమున్న గ్రామానికి తమ మకాం మార్చి జీవనోపాధి కింద దుస్తులకు రంగుల అద్దకం పనిని చేపట్టారు. దాదాపు నాలుగు దశాబ్దాల క్రితం వరకూ పామిడిలో కుటీర పరిశ్రమగా రంగుల అద్దకం పని కొనసాగింది. ఈ నైపుణ్యం వారిని రాయల్ టైలర్స్‌గా, డ్రెస్ డిజైనర్లుగా ఎదగడానికి దోహదపడింది. గుజరాత్, మహారాష్ట్ర ప్రాంతం నుంచి వలస రావడంతో వీరిని భావసార క్షత్రియులుగా పిలిచేవారు.

రెడీమేడ్‌కు పెట్టింది పేరు

దాదాపు ఐదు దశాబ్దాల క్రితం వరకూ పామిడి వాసులు ర్యాగ్స్ (ఒక సెం.మీ. వెడల్పు ఉన్న వస్త్రం)తో చిన్నారుల ఫ్యాన్సీ డ్రెస్‌లు కుట్టి అతి తక్కువ ధరకు విక్రయించేవారు. ఈ క్రమంలో పరిశ్రమల నుంచి బేళ్ల కొద్దీ సరుకును దిగుమతి చేసుకునేవారు. చేతి నిండా పని దొరకడంతో ప్రతి ఇంట్లోనూ రెండు, మూడు కుట్టుమిషన్లపై ఉదయం నుంచి రాత్రి వరకూ డ్రెస్‌లు కుట్టేవారు. ప్రస్తుతం నైటీలు, నైట్ ప్యాంట్లను కుడుతున్నారు. ఉభయ తెలుగు రాష్ట్రాలను కరువు రక్కసి పీడించిన రోజుల్లోనూ పామిడిలో ఉపాధికి ఢోకా ఉండేది కాదు. తర్వాతి కాలంలో మిల్లుల నుంచి కట్‌పీస్‌లు తెప్పించి కిలోల లెక్కన అమ్మడం మొదలు పెట్టారు. వీటితోనే ప్రస్తుతం నైట్ ప్యాంట్లు తయారవుతున్నాయి. జైపూర్ కాటన్‌తో నైటీలను పెద్ద సంఖ్యలో ఉత్పత్తి చేస్తున్నారు. ఇక్కడి ఉత్పత్తులకు ఉభయ తెలుగు రాష్ట్రాలతో పాటు కర్ణాటక, కేరళ, తమిళనాడు ప్రాంతాల్లో డిమాండ్ ఎక్కువగా ఉంది. నైటీలకు సంబంధించి 70కి పైగా, నైట్ ప్యాంట్‌లకు సంబంధించి 50 దాకా కుటీర పరిశ్రమలు ఇక్కడ వెలిశాయి. అన్ని కులాలకు చెందిన వారు ఈ వ్యాపారంలో రాణిస్తున్నారు.



నైటీల వ్యాపార దుకాణం

ధర తక్కువ.. నాణ్యత ఎక్కువ

వస్త్ర వ్యాపారంలో పామిడి వాసుల ప్రత్యేకతే వేరు. కేవలం వస్త్ర వ్యాపారం సాగించే వీధినే ప్రత్యేకంగా ఉంది. ఈ వీధిలో 130కు పైగా వస్త్ర దుకాణాలు ఉన్నాయి. ఏ వస్త్రం నాణ్యత ఏపాటిదో కంటితో చూస్తే చెప్పే నైపుణ్యం ఇక్కడి వారి సొంతం. వస్త్ర పరిశ్రమలు విస్తారంగా ఉన్న గుజరాత్, మహారాష్ట్ర నుంచి తమకు అవసరమైన ముడిసరుకును దిగుమతి చేసుకుని వ్యాపారం సాగిస్తూ వచ్చారు. నేరుగా పరిశ్రమల నుంచి వస్త్రాలను దిగుమతి చేసుకోవడంతో వినియోగదారులకు చాలా తక్కువ ధరకే లభ్యమయ్యేవి. నాణ్యమైన వస్త్రాలను మాత్రమే విక్రయిస్తూ పామిడి ఖ్యాతిని నలుదిశలా వ్యాపింపజేశారు. ఇక్కడి వస్త్రాలు కొనుగోలు చేసి ధరిస్తే ఏళ్ల తరబడి రంగు వెలిసిపోవని వినియోగదారుల నమ్మకం. దీంతో మూడు దశాబ్దాల వరకూ రాయలసీమ జిల్లాల్లో ఎవరింట శుభకార్యం జరిగినా పామిడికి చేరుకుని వస్త్రాలు కొనుగోలు చేసేవారు. ప్రస్తుతం ఎక్కడికక్కడ పెద్ద పెద్ద షాపింగ్ మాల్స్ రావడంతో పామిడి వైపు ఎక్కువగా దృష్టి సారించలేకపోతున్నారు.



వస్త్ర వ్యాపారానికి ఖ్యాతిగాంచిన పామిడిలోని మెయిన్ బజార్

మన్నిక భేష్



పామిడి వస్త్రాల మన్నిక చాలా బాగుంటుంది. ధర కూడా తక్కువే. ప్రత్యేకించి ఎక్కువ మొత్తంలో వస్త్రాలు కొనుగోలు చేయాలనుకునేవారు తప్పనిసరిగా పామిడికి వస్తుంటారు. ఇక ఇళ్ల వద్ద చీరలు, ఇతర వస్త్రాలు విక్రయించాలనుకునే మహిళలు సైతం పామిడిలోనే కొనుగోలు చేస్తుండడం విశేషం.
– డి.హొన్నూరుసాహెబ్, కల్లూరు

నాణ్యతగా ఉంటాయి



మా గ్రామం గొప్పతనం చెప్పడం కాదు కానీ, ఇక్కడ ఒక్కసారి వస్త్రాలు కొనుగోలు చేసిన ప్రతి ఒక్కరూ నాణ్యమైన సరుకు కావాలంటే పామిడికే వెళ్లాలని చెబుతుంటారు. ప్రస్తుతమున్న ధర ప్రకారం ఇతర ప్రాంతాల్లో రూ.900 చెల్లించి కొనుగోలు చేసిన ఓ ప్యాంట్ పీస్ నాణ్యతకు అదే ధరతో పామిడిలో కొనుగోలు చేసే ప్యాంట్ పీస్ నాణ్యతకు చాలా తేడా ఉంటుంది. ఇక్కడ కొనుగోలు చేసిన వస్త్రాలు చాలా కాలం పాటు మన్నిక వస్తాయి. రంగు వెలిసిపోదు. దీంతో నాణ్యత కావాలనుకునే వారు పామిడికే వచ్చి వస్త్రాలు కొనుగోలు చేస్తుంటారు.
– పి.శివకుమార్, పామిడి

రెవెన్యూ సదస్సులు సద్వినియోగం చేసుకోవాలి

- జాయింట్ కలెక్టర్ శివనారాయణ శర్మ



మాట్లాడుతున్న జేసీ శివనారాయణ శర్మ

కూడేరు: భూ, ఇతర రెవెన్యూ సమస్యలకు తక్షణ పరిష్కారం చేపేందుకు నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని ప్రజలకు జాయింట్ కలెక్టర్ శివనారాయణశర్మ పిలుపునిచ్చారు. సదస్సులో భూ, రెవెన్యూ సమస్యలపై ఇచ్చే అర్జీల్లోని అంశాలకు సంబంధించి రికార్డులు సక్రమంగా ఉంటే సత్వరమే పరిష్కారం దక్కుతుందన్నారు. కూడేరు మండలం కొర్రకోడులో బుధవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో ఆర్డీఓ కేశవ నాయుడు, డిప్యూటీ తహసీల్దార్ సూర్యప్రతాప్, మండల సర్వేయర్ అయేషా సిద్దిక్, సీఎస్‌డీటీ లక్ష్మీదేవి, వీఆర్వో తదితరులు పాల్గొన్నారు.

ఎంఐజీ లే–అవుట్ అభివృద్ధి పనులకు అడ్డంకులు లేకుండా చూడండి

కూడేరు రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్ 535లో అహుడా ఏర్పాటు చేసిన ఎంఐజీ లే–అవుట్‌కు, ఏపీఐఐసీకి కేటాయించిన భూముల్లో అభివృద్ధి పనులు చేపట్టేందుకు ఎలాంటి అడ్డంకులు లేకుండా చూడాలని మండల రెవెన్యూ అధికారులను జేసీ శివనారాయణ శర్మ ఆదేశించారు. బుధవారం ఆర్డీఓ కేశవనాయుడుతో కలసి ఎంఐజీ లే–అవుట్, ఏపీఐఐసీ భూములను ఆయన పరిశీలించారు. ఈ భూములను ఎవరూ ఆక్రమించుకోకుండా చూడాలని, అలాగే వీటికి అనంతపురం-బళ్లారి ప్రధార రహదారి నుంచి నేరుగా రోడ్డు మార్గం ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వీఆర్వో, సర్వేయర్ పాల్గొన్నారు.

విజన్ డాక్యుమెంట్ ఆవిష్కరణకు వెళ్లే వారి జాబితా ఇవ్వండి

అనంతపురం అర్బన్: ఈ నెల 13న విజయవాడలో సీఎం చంద్రబాబు ఆవిష్కరించే స్వర్ణాంధ్ర విజన్ డాక్యుమెంట్-2047 కార్యక్రమంలో పాల్గొనేందుకు ఆసక్తి ఉన్న వివిధ రంగాలకు చెందిన వ్యక్తుల జాబితాను సిద్ధం చేయాలని అధికారులను జేసీ ఆదేశించారు. విజన్ డాక్యుమెంట్ అంశంపై బుధవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో వివిధ శాఖల అధికారులతో శివనారాయణశర్మ సమీక్షించారు. ఈ కార్యక్రమంలో పాల్గొనే వారి వివరాలను గురువారంలోపు అందిస్తే సంఖ్య ఆధారంగా ప్రత్యేక బస్ ఏర్పాటు చేయవచ్చునన్నారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌ఓ ఎ.మలోల, సీపీఓ అశోక్‌కుమార్, జెడ్పీ సీఈఓ వెంకటసుబ్బయ్య, డీఆర్‌డీఏ పీడీ ఈశ్వరయ్య, మెప్మా పీడీ విశ్వజ్యోతి, డ్వామా పీడీ సలీంబాషా, పశుసంవర్ధక శాఖ జేడీ వెంకటస్వామి, ఏపీఎంఐపీ పీడీ రఘునాథరెడ్డి, డీఈఓ ప్రసాద్‌బాబు, ఆర్‌ఐఓ వెంకటరమణ నాయక్, కలెక్టరేట్ సూపరింటెండెంట్ యుగేశ్వరి, తదితరులు పాల్గొన్నారు.

'రైతు పోరుబాట'ను విజయవంతం చేద్దాం



విలేకరుల సమావేశంలో పాల్గొన్న రమేష్‌గౌడ్, తదితరులు

- 13న ర్యాలీకి పెద్దఎత్తున తరలిరండి
- వైఎస్సార్‌సీపీ టాస్క్‌ఫోర్స్ సభ్యుడు రమేష్‌గౌడ్ పిలుపు

అనంతపురం కార్పొరేషన్: కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యంతో దగా పడ్డ రైతన్నకు అండగా నిలిచేందుకు వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు చేపట్టిన రైతు పోరుబాట కార్యక్రమాన్ని విజయవంతం చేద్దామని వైఎస్సార్‌సీపీ టాస్క్‌ఫోర్స్ సభ్యుడు రమేష్‌గౌడ్ పిలుపునిచ్చారు. బుధవారం వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో బీజేపీ, టీడీపీ, జనసేన కూటమిగా ఏర్పడి రైతులకు తీరని అన్యాయం చేస్తున్నాయని మండిపడ్డారు. ఎన్నికలకు ముందు రైతులకు అన్నదాత సుఖీభవ కింద ఒక్కొక్కరికి రూ.20వేలు పెట్టుబడి సాయాన్ని అందిస్తామని చెప్పిన చంద్రబాబు అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ ఊసే ఎత్తడం లేదన్నారు. వెనుకబడిన అనంతపురం జిల్లాలో వ్యవసాయంపైనే ఎంతో మంది ఆధారపడ్డారన్నారు. గడిచిన ఆరు నెలల్లో అతివృష్టి, అనావృష్టితో తీవ్రంగా నష్టపోయారన్నారు. వ్యవసాయోత్పత్తులకు గిట్టుబాటు ధర లేకపోవడంతో రైతులు దివాళా తీసే పరిస్థితి నెలకొందన్నారు. అరకొరగా పండిన పంటను అమ్ముకోలేక అవస్థలు పడుతున్నా..ప్రభుత్వం ఏ మాత్రమూ పట్టించుకోవడం లేదన్నారు. సూపర్ సిక్స్ హామీలను చంద్రబాబు విస్మరించారన్నారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా రాష్ట్రంలో ఏదో ఒక వివాదాన్ని తీసుకువచ్చి ప్రజలను తప్పుదోవపట్టించే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో రైతులున్న ప్రాంతాల్లోనే వారి సమస్యలను పరిష్కరించుకునేలా అప్పటి సీఎం వైఎస్ జగన్ రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేశారన్నారు. ఇన్‌పుట్ సబ్సిడీ సకాలంలో మంజూరు చేశారన్నారు. అందరికీ అన్నం పెట్టే రైతన్నకు మేలు చేసేందుకు పార్టీ ఆదేశాలతో ఈ నెల 13న జిల్లాకేంద్రంలో చేపట్టిన ర్యాలీని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ నాయకులు బొనాల రఫీ, లబ్బే రాఘవ, రామ్మోహన్‌గౌడ్, హనుమంతరెడ్డి, హిదయతుల్లా, బెస్త వెంకటేష్, నరేంద్ర, రమణ, రాఘవ, భాస్కర్, చంద్రాయుడు, తేజ, దాదూ, మారుతి, తదితరులు పాల్గొన్నారు.

నేడు ఓట్ల లెక్కింపు

గుంతకల్లు: రైల్వే కార్మిక సంఘం గుర్తింపు ఎన్నికలు పూర్తి కావడంతో కీలకమైన ఓట్ల లెకింపు ప్రక్రియను గురువారం చేపట్టనున్నారు. స్థానిక రైల్వే ఇన్‌స్టిట్యూట్‌లో ఉదయం 8 గంటలకు ఓట్ల లెక్కింపు ప్రారంభం కానుంది. డివిజన్ వ్యాప్తంగా 14,359 ఓటర్లు ఉండగా 12,358 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. దీంతో 86.06 శాతం ఓటింగ్ నమోదైంది. పోలైన వాటిలో 35 శాతం ఓట్లు ఏ సంఘానికి దక్కుతాయో ఆ సంఘానికి గుర్తింపు లభిస్తుంది.


రేషన్ బియ్యం పట్టివేత



పట్టుబడిన వాహనంతో అధికారులు

బత్తలపల్లి: బ్లాక్ మార్కెట్‌కు అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని విజిలెన్స్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. వివరాలు... అనంతపురం నుంచి బెంగళూరుకు బొలెరో వాహనంలో రేషన్ బియ్యాన్ని తరలిస్తున్నట్లుగా సమాచారం అందుకున్న విజిలెన్స్ ఇన్‌స్పెక్టర్ కె.శ్రీనివాసులు, అసిస్టెంట్ జియాలాజిస్ట్ ఎ.జి.అనిల్‌కుమార్, బత్తలపల్లి డిప్యూటీ తహసీల్దార్ షణ్ముఖకుమార్ యాదవ్, వీఆర్వో రాణాప్రతాప్ బత్తలపల్లి సమీపంలోని ప్లై ఓవర్ బ్రిడ్జి కింద ధర్మవరం మంగళవారం రాత్రి తనిఖీలు చేపట్టారు. ఆ సమయంలో అటుగా వచ్చిన బొలెరో వాహనాన్ని అడ్డుకుని పరిశీలించడంతో 80 బస్తాల్లో 4,500 కిలోల రేషన్ బియ్యం బయటపడింది. దీంతో వాహనాన్ని సీజ్ చేసి, రాప్తాడు పంచాయతీ మైనారిటీ కాలనీకి చెందిన డ్రైవర్ ఎం.శ్రీకాంత్‌ను అదుపులోకి తీసుకున్నారు. బత్తలపల్లి తహసీల్దార్ స్వర్ణలత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

బియ్యం డంప్ స్వాధీనం



మామిడి తోటలో బయటపడిన బియ్యం నిల్వలు

పామిడి: స్థానిక కొండూరు రోడ్డులోని రంగనాయకులు మామిడి తోటలో భారీగా రేషన్ బియ్యం నిల్వలను బుధవారం విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ జమాల్‌బాషా, అధికారులు గుర్తించి, స్వాధీనం చేసుకున్నారు. గ్రామాల్లో లబ్ధిదారుల నుంచి కొనుగోలు చేసిన 126.25 క్వింటాళ్ల బియ్యాన్ని 250 బస్తాల్లో నింపి తోటలో డంప్ చేసినట్లుగా ప్రాథమిక విచారణలో నిర్ధారణ అయింది. వరి ధాన్యాన్ని తాము తూర్పార పడుతున్న సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు వచ్చి బియ్యం ప్యాకెట్లను దించి వెళ్లినట్లు అధికారులకు తోటను కౌలుకు తీసుకున్న వన్నప్ప వివరించాడు. స్వాధీనం చేసుకున్న బియ్యాన్ని సీఎస్‌డీటీ కంబక్క సమక్షంలో గుంతకల్లులోని ఎఫ్‌సీఐ గోదాముకు తరలించారు.

సీఎం సదస్సులో కలెక్టర్



సదస్సులో పాల్గొన్న కలెక్టర్ వినోద్‌కుమార్

అనంతపురం అర్బన్: విజయవాడ వేదికగా రాష్ట్రంలోని అన్ని జిల్లాల కలెక్టర్లతో సీఎం చంద్రబాబునాయుడు తలపెట్టిన రెండు రోజుల సదస్సు బుధవారం ప్రారంభమైంది. ఈ సదస్సులో జిల్లా కలెక్టర్ వినోద్‌కుమార్ పాల్గొన్నారు. రెండవ రోజు గురువారం జరగనున్న సదస్సులో జిల్లా అభివృద్ధి నివేదికను ఆయన సమర్పించనున్నట్లు సమాచారం.

ఐసీడీఎస్ పీడీ బాధ్యతల స్వీకరణ



బాధ్యతలు స్వీకరిస్తున్న వనజ అక్కమ్మ

అనంతపురం సెంట్రల్: మహిళాశిశు సంక్షేమశాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్‌గా వనజ అక్కమ్మ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. కంబదూరు సీడీపీఓగా పనిచేస్తున్న ఆమెను పదోన్నతిపై పీడీగా నియమించిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా ఆమెకు ఐసీడీఎస్ ఉద్యోగులు పుష్పగుచ్ఛాలుఅందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం జేసీ శివనారాయణ శర్మను కలెక్టరేట్‌లోని ఆయన చాంబర్‌లో ఆమె మర్యాదపూర్వకంగా కలిశారు.

ప్రమాదంలో మహిళా కూలీ మృతి



మృతురాలు అనసూయమ్మ

కూడేరు: ద్విచక్ర వాహనం ఢీకొన్న ఘటనలో ఆటోలో ప్రయాణిస్తున్న ఓ మహిళా కూలీ మృతి చెందింది. పోలీసులు తెలిపిన మేరకు... కూడేరు మండలం కొర్రకోడుకు చెందిన అనసూయమ్మ (52), సంగమ్మ, బెస్త పద్మావతి బుధవారం ఉదయం జల్లిపల్లిలో వ్యవసాయ కూలి పనులకు వెళ్లారు. పనులు ముగించుకున్న అనంతరం సాయంత్రం తమ స్వగ్రామానికి చెందిన అభి ఆటోలో తిరుగు ప్రయాణమయ్యారు. మార్గమధ్యంలో కొర్రకోడు గ్రామానికి చెందిన యువకుడు గణేష్ ద్విచక్ర వాహనంపై వేగంగా వస్తూ ఢీకొనడంతో ఆటో అదుపు తప్పి బోల్తాపడింది. ఘటనలో మహిళా కూలీలతో పాటు గణేష్ తీవ్రంగా గాయపడ్డాడు. స్వల్పగాయాలతో అభి బయటపడ్డాడు. క్షతగాత్రులను 108 వాహనంలో అనంతపురంలోని ఆస్పత్రికి తరలించగా, చికిత్సకు స్పందించక అనసూయమ్మ మృతి చెందింది. పద్మావతి పరిస్థితి విషమంగా ఉంది. పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

రెవెన్యూ ఉద్యోగి ఆకస్మిక మృతి



శివప్రసాద్‌శర్మ (ఫైల్)

బెళుగుప్ప: జిల్లా కేంద్రంలో నివాసముంటున్న స్థానిక తహసీల్దార్ కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ శివప్రసాద్‌శర్మ (61) మంగళవారం అర్ధరాత్రి తన స్వగృహంలోనే గుండెపోటుతో మృతి చెందారు. ఆయనకు భార్య భాగ్యలక్ష్మి, ఓ కుమారుడు, కుమార్తె ఉన్నారు. సమాచారం అందుకున్న తహసీల్దార్ షర్మిల, ఆర్ఐ రమాదేవి, కార్యాలయ సిబ్బంది బుధవారం అనంతపురంలోని శివప్రసాద్‌శర్మ గృహానికి చేరుకుని మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ఎలుగుబంటి దాడి... వ్యక్తికి తీవ్ర గాయాలు

రాయదుర్గం టౌన్: మండలంలోని ఆర్‌బీవంక గొల్లలదొడ్డి గ్రామంలో పంట కాపలాకు వెళ్లిన బాగురప్పపై ఎలుగుబంటి దాడి చేసి గాయపర్చింది. ఈ ఘటన మంగళవారం రాత్రి జరిగింది. క్షతగాత్రుడిని స్థానికులు వెంటనే రాయదుర్గంలోని ఏరియా ఆస్పత్రికి తీసుకెళ్లారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం అనంతపురానికి తరలించారు. మంగళవారం అర్ధరాత్రి దాటిన తర్వాత పొలంలో కుక్కలు మొరగడంతో అడవిపందులు వచ్చి ఉంటాయని భావించిన బాగురప్ప లేచి కేకలు వేయడంతో హఠాత్తుగా ఎలుగుబంటి దాడి చేసింది. అక్కడే ఉన్న మరో వ్యక్తి గట్టిగా కేకలు వేయడంతో ఎలుగుబంటి బెదిరి సమీపంలోని గుట్టలోకి పరుగు తీసింది.

వేధింపుల కేసులో ముద్దాయికి ఏడాది జైలు

అనంతపురం: అదనపు కట్నం వేధింపుల కేసులో ముద్దాయికి ఏడాది జైలు శిక్ష విధిస్తూ మొబైల్ జడ్జి సుజిన్ తీర్పు వెలువరించారు. వివరాలు... అనంతపురం నగరానికి చెందిన వెన్నపూస సౌభాగ్యలక్ష్మిని కనగానపల్లి మండలం తగరకుంట గ్రామానికి చెందిన జి.బ్రహ్మానందరెడ్డికి ఇచ్చి వివాహం చేశారు. పెళ్లి సమయంలో వరకట్నం కింద రూ.5 లక్షలను సౌజన్యలక్ష్మి తల్లిదండ్రులు ఇచ్చారు. అయినా మరో రూ.10 లక్షలు తేవాలంటూ భర్త, ఆయన తండ్రి ఆదిరెడ్డి, తల్లి లక్ష్మీదేవి, సోదరుడు చెన్నారెడ్డి, మరదలు జి.కృష్ణకుమారి (చెన్నారెడ్డి భార్య) తనను వేధిస్తున్నారంటూ 2016, ఫిబ్రవరి 28న అనంతపురం మూడో పట్టణ పోలీస్ స్టేషన్‌లో బాధితురాలు ఫిర్యాదు చేసింది. దీనిపై కేసు నమోదు చేసిన పోలీసులు నిందితులను అరెస్ట్ చేసి న్యాయస్థానంలో హాజరుపరిచారు. అప్పటి నుంచి మొబైల్ కోర్టులో ఈ కేసు వాదనలు జరుగుతూ వచ్చాయి. నేరం రుజువు కావడంతో జి.బ్రహ్మానందారెడ్డికి ఏడాది జైలు శిక్ష, రూ.5 వేలు జరిమానా విధిస్తూ న్యాయమూర్తి సుజిన్ తీర్పు వెలువరించారు. మిగిలిన నలుగురిని నిర్దోషులుగా పేర్కొన్నారు. ఈ కేసులో ప్రాసిక్యూషన్ తరపున ఏపీపీ వి.శ్రీనివాసులు వాదనలు వినిపించారు.

ఇదో అద్భుతం!



గుత్తి కోటలో పర్యటిస్తున్న గుంతకల్లు రైల్వే డివిజన్ కమాండెంట్ అనిల్‌కుమార్ సింగ్

గుత్తి: గుత్తి కోట చాలా అద్భుతంగా ఉందని గుంతకల్లు రైల్వే డివిజన్ ఆర్పీఎఫ్ కమాండెంట్ అనిల్‌కుమార్ సింగ్ కితాబునిచ్చారు. బుధవారం ఆయన కుటుంబసభ్యులతో కలసి గుత్తి కోటను సందర్శించారు. కోటలోని గుర్రపు శాలలు, ఏనుగు శాలలు, బావులు, రంగ మంటపంతో పాటు ఆంగ్లేయుల సమాధులను పరిశీలించారు. గుత్తి కోట సంరక్షణ సమితి అధ్యక్షుడు విజయ భాస్కర్, కోట గైడ్ రమేష్ వారి వెంట ఉంటూ కోట చరిత్ర, ప్రాముఖ్యతను వివరించారు. గుత్తి కోట సంరక్షణ సమితి సభ్యులు బాబా సాహెబ్, జిలాన్, శివకుమార్, బాలు, గౌస్, పురావస్తు సిబ్బంది ఆంజనేయులు, అమృత్, శ్రీరాములు, కృష్ణ చైతన్య తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

బాధ్యతగా విధులు నిర్వర్తించాలి



జేసీ శివనారాయణ శర్మకు పూలమొక్క అందజేస్తున్న ఐసీడీఎస్ పీడీ వనజా అక్కమ్మ

అనంతపురం అర్బన్: విమర్శలకు తావివ్వకుండా బాధ్యతగా విధులు నిర్వర్తించాలని ఐసీడీఎస్ నూతన పీడీ వనజా అక్కమ్మకు జాయింట్ కలెక్టర్ శివ నారాయణ శర్మ సూచించారు. బుధవారం జేసీని ఐసీడీఎస్ నూతన పీడీ వనజా అక్కమ్మ మర్యాదపూర్వకంగా కలిశారు. పూలమొక్క అందజేశారు.

‘దళిత ఉద్యోగులపై పెత్తనం తగదు’

అనంతపురం టవర్‌క్లాక్: కేఎస్ఆర్ హైస్కూల్‌లో దళితులను కులం పేరుతో దూషిస్తూ పెత్తనం చెలాయించడం తగదని జై భీమ్ రావు భారత్ పార్టీ జిల్లా యూత్ ప్రెసిడెంట్ చందునాయక్ మండిపడ్డారు. బుధవారం స్థానిక ఆర్ అండ్‌బీ అతిథి గృహంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. కేఎస్ఆర్ హైస్కూల్‌లో పది సంవత్సరాలుగా పని చేస్తున్న వాచ్‌మెన్ నాగరాజు, ఆయాలు లక్ష్మీదేవి, సరోజమ్మను కులం పేరుతో దుషించడం సరికాదన్నారు. వారిపై పెత్తనం సాగిస్తు తొలగించాలని ప్రయత్నం చేస్తున్న ఉపాధ్యాయురాలు మదమంచి శైలజను తక్షణమే సస్పెండ్ చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు సభవత్ గోవింద్ నాయక్ పాల్గొన్నారు.

సుస్థిరాభివృద్ధి లక్ష్యాలపై శిక్షణ



గ్రామాల అభివృద్ధిపై శిక్షణ ఇస్తున్న అధికారులు

ఆత్మకూరు: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం సర్పంచులు, ఎంపీటీసీలకు సుస్థిరాభివృద్ధి లక్ష్యాలపై శిక్షణ కార్యక్రమం ప్రారంభమైంది. పేదరికం నిర్మూలన, ఆరోగ్యకరమైన గ్రామం, జీవనోపాధి కల్పన, సురక్షితమైన నీరు, పరిశుభ్రత కలిగిన గ్రామాలుగా తీర్చిదిద్దేందుకు తీసుకోవాల్సిన చర్యలపై అధికారులు శిక్షణ ఇచ్చారు. కాగా.. సర్పంచులు, ఎంపీటీసీలను రెండు బ్యాచ్‌లుగా విభజించి శిక్షణ ఇవ్వడం జరుగుతుందని అధికారులు పేర్కొన్నారు. 11వ తేదీన ఒక బ్యాచ్‌కు, 12వ తేదీన మరో బ్యాచ్‌కు శిక్షణ ఉంటుందని ఎంపీడీఓ లక్ష్మీనరసింహ తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ హేమలత, ఈఓఆర్డీ కామాక్షి, ఏఓ నాగకృష్ణయ్య, పంచాయతీ సెక్రటరీలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

తులసి మొక్కల పంపిణీ



తులసి మొక్కలను అందజేస్తున్న స్వచ్ఛంద సంస్థల నిర్వాహకులు

అనంతపురం కల్చరల్: సంపూర్ణ ఆరోగ్య ప్రదాయినిగా పూజలందుకునే తులసి మొక్కలను ఇంటింటికీ అందజేసేందుకు కృషి చేస్తున్నట్లు ధార్మిక సంస్థల ప్రతినిధులు తెలిపారు. బుధవారం స్థానిక శ్రీనివాసనగర్‌లోని రామాలయం వద్ద శ్రీవారి సేవకులు ఇంటింటికి వెళ్లి తులసి మొక్కలు పంపిణీ చేశారు. తులసితో వచ్చే ప్రయోజనాలను వివరిస్తూ.. ప్రతి ఇంట్లో అందరూ ఆరోగ్యంగా ఉండడానికి తులసిపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో రాము, సురేష్, అనిల్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సమాచార హక్కు చట్టం వజ్రాయుధం



సదస్సులో పాల్గొన్న విద్యార్థులు

అనంతపురం ఎడ్యుకేషన్: సమాచార హక్కు చట్టం వజ్రాయుధం అని సమాచార హక్కు పరిరక్షణ సంఘం జిల్లా అధ్యక్షుడు హొన్నూరప్ప పేర్కొన్నారు. బుధవారం స్థానిక ప్రభుత్వ బాలుర ఐటీఐ విద్యార్థులకు సమాచార హక్కు చట్టంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా హొన్నూరప్ప మాట్లాడుతూ.. పరిపాలనలో పారిదర్శకత, అధికారుల్లో జవాబుదారీతనాన్ని పెంపొందించి అవినీతికి అంతం పలకాలన్నదే సమాచార హక్కు చట్టం ప్రధాన ఉద్దేశం అన్నారు. లంచం తీసుకోవడంతో పాటు ఇవ్వడమూ నేరమని పేర్కొన్నారు. పాలనలో పారదర్శకత కోసమే ప్రభుత్వం సమాచార హక్కు చట్టాలన్ని ప్రవేశపెట్టిందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఐటీఐ ప్రిన్సిపాల్ రామమూర్తి, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

చెన్నకేశవా.. ఆక్రమణలు కనవా

- దర్జాగా లక్ష్మీచెన్నకేశవ స్వామి మాన్యం కబ్జా
- కబ్జాదారులకు అండగా నిలిచిన టీడీపీ నేత
- దేవుడి మాన్యం కోసం పోరాటం సాగిస్తున్న ఆధ్యాత్మిక ప్రతినిధులు





ఆక్రమణల నడుమ నగరంలోని లక్ష్మీచెన్నకేశవ ఆలయం

అనంతపురం కల్చరల్: జిల్లాలోనే అతి ప్రాచీనమైన వాటిల్లో నగరంలోని లక్ష్మీచెన్నకేశవ స్వామి ఆలయం ముందువరుసలో ఉంటుంది. ఇక్కడి చరిత్ర కూడా ఎంతో ఆసక్తికరంగా ఉంటుంది. ఆంగ్లేయుల కాలం నాటికే అప్పుడు డిప్యూటీ కలెక్టర్‌గా ఉన్న బిండిగవల నరసింహాచార్‌కు ఓ రోజు లక్ష్మీ చెన్నకేశవస్వామి విగ్రహం దొరికిందని ఫలానా చోట తనను ప్రతిష్ఠించమని చెప్పినట్టు వారి అనువంశీకులు ఇప్పటికీ చెప్పుకుంటారు. అలా తాడిపత్రి బస్టాండ్ వద్ద 1,870లో ఆలయాన్ని సొంత ఖర్చులతో నిర్మించారు. ఎన్నో ఆస్తులను సమకూర్చి దివ్యంగా పూజోత్సవాలు నిర్వహించడానికి కృషి చేశారు. ప్రస్తుతం ఎండోమెంట్ పరిధిలోని దేవుడి మాన్యాన్ని దర్జాగా కొంతమంది కబ్జా చేసుకుని అనుభవిస్తున్నారు. మరో విశేషమేమంటే టీడీపీ నాయకులే పేదవాళ్లకు ఆశ చూపి కబ్జా కోరల్లో చిక్కుకునేలా చేశారని.. ఇప్పటికీ సహకారం అందిస్తున్నారని హిందుత్వ సంస్థల నాయకులు ఆరోపిస్తున్నారు. మాన్యం కోసం నాలుగు నెలలుగా పోరాటం సాగిస్తున్నారు.

దేవుడి మాన్యమిదే..

లక్ష్మీ చెన్నకేశవస్వామి ఆలయానికి సంబంధించి ఆలయం చుట్టుపక్కల 230 సర్వే నంబర్‌లో 1.08 ఎకరాల మాన్యం ఉంది. ప్రస్తుతమంతా ఆక్రమణలో ఉంది. అలాగే 2081/9 సర్వే నంబర్ కింద నీరుగంటి వీధిలో 64 సెంట్ల భూమి, 297/6 సర్వే నంబరు కింద వేణుగోపాల నగర్‌లో మరో 68 సెంట్లు స్వామికి చెందిన భూములుండగా.. ఇవన్నీ ఆక్రమణలోనే ఉన్నాయి. అలాగే శింగనమల మండలం చిన్న జలాలపురంలో 149.59 ఎకరాలు, గార్లదిన్నె మండలం పి.కొత్తపల్లి గ్రామంలో 63.40 ఎకరాల భూములు, బుక్కరాయసముద్రంలో చెరువుకు ఆధారంగా ఉండే 4.32 ఎకరాల భూములు ఉండగా.. వీటిని రైతులు కౌలు చేస్తున్నారు. అయితే ఇక్కడ కూడా రాజకీయ నేపథ్యంలో కౌలు సక్రమంగా కట్టడం లేదని హిందుత్వ సంస్థలు ఆరోపిస్తున్నాయి.

అప్పనంగా పొజిషన్ సర్టిఫికెట్లు..

దేవదాయశాఖకు కానీ రెవెన్యూ శాఖకు కానీ ప్రభుత్వ పోరంబోకు తప్ప దేవుడి మాన్యాలను పంచడానికి అధికారాలు ఉండవు. కేవలం ఎండోమెంట్ అనుమతితో మాత్రమే పట్టాలు తీసుకోవాలని చట్టాలు చెబుతున్నాయి. దీనిని బేఖాతరు చేస్తూ టీడీపీ హయాంలో అప్పటి ఎమ్మెల్యే ప్రభాకర చౌదరి స్వయంగా పొజిషన్ సర్టిఫికెట్లు ఇప్పించడం వివాదాస్పదమైంది. ఆఖరకు అప్పటి తహసీల్దార్‌ను బాధ్యుడిగా చేస్తూ సస్పెండ్ కూడా చేశారు. దీనికి తోడు ఆక్రమణదారులను కోర్టుకెళ్లేలా ప్రోత్సాహించారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ముఖ్యంగా ఆక్రమించుకున్న వారి నుంచి కొంత సొమ్ము వసూలు చేసుకోవడం వల్లనే ఎండోమెంటు అధికారులకు అడ్డుతగులుతున్నారు అనేది ప్రధాన ఆరోపణ. 2023లో వైఎస్ జగన్ ప్రభుత్వం కబ్జాదారులు కోర్టుకు వెళ్లకుండా ప్రత్యేక చట్టాలు తెచ్చింది. అయితే అంతకు ముందు కబ్జా సాగితే కోర్టుల్లో దశాబ్దాల తరబడి సాగిపోవడం కూడా కబ్జాలు అధికం కావడానికి ఓ కారణమనే చెప్పాలి.

పోరాటం ఆగదు



గత నాలుగు నెలలుగా మేము అన్యాక్రాంతమైన పాతూరు చెన్నకేశవ స్వామి ఆలయ భూముల కోసం పోరాటం చేస్తున్నాం. ఈ విషయంలో హిందుత్వ సంస్థలన్నీ ఏకమవుతున్నాయి. మునిసిపల్ చైర్మన్‌గా, ఎమ్మెల్యేగా పని చేసిన వ్యక్తికి చట్టాలు తెలియవని అనుకోం. అయినా పొజిషన్ సర్టిఫికెట్లు జారీ చేయించడం దుర్మార్గం. మాన్యం అంతు తేలేవరకు మా పోరాటం ఆగదు. ఎండోమెంట్ అధికారులు కూడా వెంటనే చర్యలు తీసుకుని దేవుడి మాన్యాన్ని రక్షించాలి.

– విశ్వేశ్వరరెడ్డి, హిందూ చైతన్య వేదిక

నోటీసులు అందించాం



స్వామి వారి మాన్యాన్ని ఆక్రమించుకున్న మాట వాస్తవమే. మేము కూడా ఇటీవలే వారందరికీ నోటీసులిచ్చి త్వరగా ఖాళీ చేయాలని ఆదేశించాం. అంబారుపు వీధిలో 67 మందికి గాను 62 మందికి, నీరుగంటి వీధిలో 52 మందికి, వేణుగోపాల నగర్‌లో మరో 34 మందికి నోటీసులు జారీ చేశాం. తతిమా వారు కోర్టుకెళ్లారు. తీర్పు వచ్చే వరకు ఎండోమెంట్ కలుగజేసుకోవడం కష్టంగా ఉంటుంది. దేవుడి ఆస్తులను కాపాడుకునేందుకు మేము విశ్వప్రయత్నం చేస్తున్నాం.

– సుధారాణి, ఈఓ, లక్ష్మీ చెన్నకేశవస్వామి ఆలయం

14 నుంచి దత్త జయంతి వేడుకలు

అనంతపురం కల్చరల్: పాతూరులోని శృంగేరీ శారదా పీఠం ఆధ్వర్యంలో నడిచే దత్తాత్రేయ దేవాలయంలో ఈనెల 14, 15వ తేదీల్లో దత్త జయంతి వేడుకలు నిర్వహిస్తున్నట్లు ఆలయ ప్రతినిధి అప్పా సుధీర్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. గణపతి పూజ, హోమం, కలశస్థాపన, అనఘాష్టమి వ్రతాలు, సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాలు జరుగుతాయని పేర్కొన్నారు. 15న ఉదయం 6 గంటల నుంచే స్వామికి కవచాలంకారం, దత్తనామకరణ బ్రహ్మోపదేశం, దత్తభిక్ష, పూర్ణాహుతి, రథోత్సవం నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. అలాగే తపోవనం సమీపంలోని ప్రశాంతి నగర్‌లో కొలువుదీరిన ఔదంబర వృక్షం వద్ద అన్నపూర్ణదేవి సమేత కాశీవిశ్వనాథస్వామి, దత్తాత్రేయ గురుదేవుల వ్రతాలు జరుగుతాయని నిర్వాహకుడు శారదాచంద్రమౌళి తెలిపారు. మధ్యాహ్నం స్వామి భిక్ష ఉంటుందని పేర్కొన్నారు.

15న చలో కడప



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ప్రతినిధులు

అనంతపురం కల్చరల్: ముస్లిం మైనార్టీల మనోభావాలను దెబ్బతీస్తూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్న విధానాలను వ్యతిరేకిస్తూ ఈనెల 15న చలో కడప కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు జమీయతే ఉల్మాయే హింద్ ప్రతినిధులు తెలిపారు. బుధవారం స్థానిక ఐదవ రోడ్డు మసీదులో చలో కడప పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 15న సాయంత్రం 4 గంటలకు కడప జిల్లాలో లక్షలాది మందితో పెద్ద సభ నిర్వహిస్తున్నామన్నారు. దేశాభివృద్ధి, రాజ్యాంగ పరిరక్షణ, మైనార్టీల హక్కుల సాధనే లక్ష్యంగా సాగే సమావేశానికి స్వచ్ఛందంగా తరలి రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జమియతే ఉల్మా జాతీయ అధ్యక్షుడు హజరత్ మౌలానా సయ్యద్ షా అర్షద్‌తో పాటూ దేశంలోని ముఖ్యమైన మత పెద్దలు ఆత్మీయ అతిథులుగా విచ్చేస్తున్నట్లు సంస్థ ప్రతినిధి మౌలానా ముస్తాక్ అబ్దుల్లా తెలిపారు. కార్యక్రమంలో జమ్మియతే ఉల్మా సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

ర్యాలీ విజయవంతం చేయాలి

అనంతపురం కార్పొరేషన్: రాష్ట్రానికి వెన్నెముకగా నిలుస్తున్న రైతాంగాన్ని కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యం చేసింది. రైతులకు అండగా నిలిచేందుకు పార్టీ అధిష్టానం పిలుపు మేరకు ఈనెల 13న నగరంలో జరిగే ర్యాలీని విజయవంతం చేయాలని డిప్యూటీ మేయర్ కోగటం విజయభాస్కర్ రెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం నగరపాలక సంస్థలోని ఆయన చాంబర్‌లో విలేకరులతో మాట్లాడారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి రైతుల అభ్యున్నతికి పాటుపడ్డారన్నారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వంలోని సీఎం చంద్రబాబు నాయుడు రైతులకు తీరని అన్యాయం చేస్తున్నారన్నారు. అన్నదాత సుఖీభవ కింద రైతులకు రూ.20 వేలు ఇస్తామని మాట తప్పారన్నారు. సమావేశంలో కార్పొరేటర్లు అబూసలేహా, చంద్రమోహన్ రెడ్డి, నాయకులు రామచంద్ర తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డిప్యూటీ మేయర్ కోగటం విజయభాస్కర్ రెడ్డి

రైతులను రోడ్డుపాలు చేసిన ప్రభుత్వం

అనంతపురం కార్పొరేషన్: కూటమి ప్రభుత్వం రైతులను రోడ్డుపాలు చేసిందని మాజీ అగ్రి అడ్వైజరీ బోర్డు సభ్యుడు రామచంద్రారెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. కూటమి ప్రభుత్వం వచ్చి ఆరు నెలలు గడుస్తున్నా రైతులకు ఇస్తామన్న అన్నదాత సుఖీభవ ఇవ్వలేదన్నారు. రైతుల పట్ల ప్రభుత్వం చూపుతున్న నిర్లక్ష్య ధోరణిని నిరసిస్తూ ఈనెల 13న పార్టీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో జరిగే ర్యాలీకి రైతులు పెద్ద ఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు.

ప్రభుత్వ నిర్లక్ష్యంతో వ్యవసాయం కుదేలు



రాప్తాడు: పోస్టర్లను విడుదల చేస్తున్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు

రాప్తాడు: కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యంతో వ్యవసాయ రంగం కుదేలైంది. రైతాంగ సమస్యలను విస్మరిస్తున్న కూటమి ప్రభుత్వానికి తగిన బుద్ధి చెప్పేందుకు రైతులు పోరుబాటకు సిద్ధమవ్వాలని వైస్ ఎంపీపీ బోయ రామాంజనేయులు, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ జూటూరు శేఖర్ పేర్కొన్నారు. బుధవారం స్థానిక వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయం వద్ద ‘అన్నదాతకు అండగా వైఎస్సార్‌సీపీ’ పోస్టర్లను ఆవిష్కరించారు. ప్రభుత్వానికి కనువిప్పు కలిగించడమే లక్ష్యంగా ఈనెల 13న జిల్లా కేంద్రంలో భారీ ర్యాలీ నిర్వహిస్తున్నామన్నారు. ఉదయం 10 గంటలకు అనంతపురం జెడ్పీ కార్యాలయం ముందున్న దివంగత మహానేత వైఎస్సార్ విగ్రహం వద్ద నుంచి ర్యాలీ ప్రారంభమై కలెక్టరేట్ వరకు సాగుతుందన్నారు. అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రం అందించనున్నట్లు తెలిపారు. కార్యక్రమానికి మండలంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజా ప్రతినిధులు, రైతులు తరలివచ్చి విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు మాజీ వైస్ ఎంపీపీ గవ్వల పరందామ, మన్నల రవి కుమార్, దండు బీరన్న, నారాయణ రెడ్డి, చిరుతల నాగేంద్ర, ఫక్కీరప్ప, నారప రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బైక్‌ల ఢీ: ఇద్దరికి గాయాలు

అనంతపురం: నగరంలోని సైఫుల్లా బ్రిడ్జిపై బుధవారం సాయంత్రం ఎదురెదురుగా వస్తున్న బైక్‌లు ఢీకొనడంతో ఇద్దరికి గాయాలు అయ్యాయి. వివరాలు.. నాగరాజు (40) నీలిమ టాకీస్ చంద్ర హాస్పిటల్ వైపునకు వెళ్తుండగా.. చంద్ర హాస్పిటల్ నుంచి హరీష్.. నీలిమ టాకీస్ వైపు వస్తున్నాడు. వీరిద్దరూ ఎదురెదురుగా ఢీకొన్నారు. హరీష్ తలకు, కుడి పాదానికి గాయమైంది. నాగరాజు కుడికాలికి గాయాలయ్యాయి. కేసు నమోదు చేసినట్లు ట్రాఫిక్ పోలీసులు తెలిపారు.

రుణాలు రెన్యూవల్ చేయాలి

చెన్నేకొత్తపల్లి: స్థానిక కెనరా బ్యాంక్‌లో బంగారు రుణాలు తీసుకున్న వారితో వడ్డీ కట్టించుకుని రెన్యూవల్ చేయాలని సీఐటీయూ నాయకుడు లింగన్న, బీజేపీ నాయకుడు జిలకర ఆంజనేయులు కోరారు. బుధవారం వారు బ్యాంక్ మేనేజర్ అనూప్‌ను కలిసి, సమస్యలను విన్నవించారు. అసలు, వడ్డీ చెల్లించి రుణాలు రెన్యువల్ చేసుకునేందుకు రైతులు ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు. వడ్డీ మాత్రమే కటించుకుని రెన్యూవల్ చేయాలని కోరారు. మేనేజర్ మాట్లాడుతూ.. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి వడ్డీతోనే రెన్యువల్ చేసుకునేలా చూస్తామని హామీ ఇచ్చారు. ఇందుకు రెండు మూడు రోజులు సమయం కావాలన్నారు. రుణాలు పొందిన వారికి ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకుంటామన్నారు.

జాతీయస్థాయి సాఫ్ట్ టెన్నిస్ పోటీలకు ఎంపిక



తనుశ్రీని అభినందిస్తున్న ఎస్ఆర్ విద్యా సంస్థల జోనల్ ఇన్‌చార్జ్ శివకుమార్

అనంతపురం ఎడ్యుకేషన్: నగరంలోని ఎస్ఆర్ జూనియర్ కళాశాల మొదటి సంవత్సరం విద్యార్థిని కె.తనుశ్రీ జాతీయస్థాయి సాఫ్ట్ టెన్నిస్ పోటీలకు ఎంపికైంది. బుధవారం కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో తనుశ్రీని అభినందించారు. ఈ సందర్భంగా ఎస్ఆర్ విద్యా సంస్థల జోనల్ ఇన్‌చార్జ్ శివకుమార్ మాట్లాడుతూ.. ఈ పోటీలకు ఆంధ్రప్రదేశ్ నుంచి ఐదుగురు విద్యార్థులు ఎంపిక కాగా.. అందులో తనుశ్రీ ఉందని తెలిపారు. ఈనెల 17 నుంచి 24 వరకు ఉత్తర ప్రదేశ్‌లో జాతీయస్థాయి పోటీలు జరుగుతాయన్నారు. జాతీయ స్థాయి పోటీల్లో ప్రతిభ చాటి జిల్లాకు పేరు తేవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఏజీఎంలు జగన్ మోహన్‌రెడ్డి, వెంకట్, కల్పన, డీన్ రాధాకృష్ణ, ప్రిన్సిపాళ్లు జగదీష్ బాబు, భవాని, రాజేష్ పాల్గొన్నారు.

మార్మోగిన శ్రీకృష్ణుడి నామస్మరణ



గీతామందిరంలో సామూహిక గీతాపారాయణం

అనంతపురం కల్చరల్: మోక్ష ఏకాదశి పర్వదినాన వచ్చిన గీతా జయంతి వేడుకలు బుధవారం పలు చోట్ల భక్తిశ్రద్ధలతో సాగాయి. వాడవాడల కృష్ణభగవానుడు ప్రబోధించిన భగవద్గీత మార్మోగింది. తెల్లవారు జామున నుంచే స్థానిక గీతామందిరంలో సామూహిక గీతాపారాయణంలో 18 అధ్యాయాలను భక్తులు పఠించారు. పరుచూరు రమేష్‌బాబు ఆధ్వర్యంలో అంతకు ముందు కృష్ణార్జునులకు ప్రత్యేక పూజలు జరిగాయి. అలాగే ఇస్కాన్ మందిరంలో గీతా జయంతి వేడుకలు నిర్వహించారు. మందిరం అధ్యక్షుడు దామోదర గౌరంగదాసు నేతృత్వంలో గీతా ప్రవచనం, రాధాపార్థసారథులకు అభిషేకాలు, అర్చనలు జరిగాయి. ఏకాదశి సందర్భంగా స్థానిక అశోక్ నగర్‌లో సామూహిక సత్యదేవుడి వ్రతాలను ఘనంగా జరిపించారు. రమా సమేత సత్యదేవుడికి విశేష అలంకార సేవలు జరిగాయి. కార్యక్రమంలో కమిటీ అధ్యక్షుడు అంబటి ఫణిరాజ్, నిర్వాహకులు తిరువీధుల జగదీష్, బొగ్గరపు రవి తదితరులు పాల్గొన్నారు.

ఎస్వీ డిగ్రీ అండ్ పీజీ కళాశాలలో..

అనంతపురం ఎడ్యుకేషన్: స్థానిక ఎస్వీ డిగ్రీ అండ్ పీజీ కళాశాల సంస్కృతం శాఖ ఆధ్వర్యంలో బుధవారం గీతాజయంతి వేడుకలు నిర్వహించారు. కళాశాల వైస్ చైర్మన్ సి.చక్రధరరెడ్డి తదితరులు శ్రీకృష్ణుడి చిత్రపటానికి పూలమాల వేశారు. గీతాజయంతి విశిష్టతను తెలియజేశారు. ప్రిన్సిపాల్ డాక్టర్ వరప్రసాద్ గీతా జయంతి పుట్టుక దాని పరమార్థం వివరించారు. సంస్కృత శాఖాధిపతి డాక్టర్ అంకే ఆదెప్ప మాట్లాడుతూ.. భగవద్గీత ప్రపంచానికి గొప్ప ప్రేరణ అన్నారు. ఇది సనాతన ధర్మ వైభవాన్ని తెలియ జేయడమే కాకుండా ఆధునిక భౌతిక శాస్త్రానికి పునాదులు వేయడంలో తోడ్పడిందన్నారు. గీతలోని ఉపదేశాలు జీవితంలో ఆచరిస్తే సమాజం, ఉన్నత స్థితికి చేరుకుంటుందన్నారు. గీత చదివితే రాత మారుతుందన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు డాక్టర్ శ్రీనివాసులు, డాక్టర్ ఈ.మురళీధర్, ఏఓ శ్రీనాథ్ పాల్గొన్నారు.



అశోక్‌నగర్‌లో పూజలందుకున్న రమాసమేత సత్యదేవుడు

భూ సమస్యల పరిష్కారానికి చర్యలు



ఆత్మకూరు: ముట్టాల గ్రామంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పరిటాల సునీత



రాప్తాడు: వినతిపత్రాలు స్వీకరిస్తున్న తహసీల్దార్ విజయ కుమారి

రాప్తాడు: భూ సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తోంది. రైతులు సద్వినియోగం చేసుకుని సమస్యలు పరిష్కరించుకోవాలని తహసీల్దార్ విజయకుమారి పేర్కొన్నారు. బుధవారం మండలంలోని యర్రగుంట గ్రామంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ.. రైతులు, వివిధ వర్గాల ప్రజలు ఎదుర్కొనే సమస్యలు, దీర్ఘకాలిక రెవెన్యూ సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించాలనే లక్ష్యంతో ప్రభుత్వం రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తోందన్నారు. అనంతరం ప్రజలు, రైతుల నుంచి వినతిపత్రాలు స్వీకరించారు. రూరల్ సబ్ రిజిస్ట్రార్ ఇస్మాయిల్, ఆర్ఐ కరుణాకర్, సర్వేయర్ రామాంజనేయులు, వీఆర్వోలు రవికుమార్ పాల్గొన్నారు.

ఆత్మకూరు: మండలంలో ఉన్న భూ సమస్యలను పరిష్కరించేందుకు అధికారులు కృషి చేయాలని ఎమ్మెల్యే పరిటాల సునీత సూచించారు. బుధవారం మండలంలోని ముట్టాల గ్రామంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. భూ సమస్యలపై రెవెన్యూ అధికారులు ప్రత్యేక చొరవ చూపాలన్నారు. ముట్టాల పంచాయతీలోని పాపంపల్లి గ్రామానికి శ్మశాన వాటికకు స్థలం కేటాయించాలని వినతిపత్రం అందించారు. అనంతరం భూ సమస్యలపై అర్జీలను స్వీకరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ లక్ష్మీనాయక్, ఎంపీడీఓ లక్ష్మీనరసింహ, వీఆర్వోలు, అధికారులు పాల్గొన్నారు.

రోడ్డు మరమ్మతు



గుంతలను పూడ్చిన దృశ్యం

చెన్నేకొత్తపల్లి: మండల పరిధిలోని చందమూరు వద్ద రోడ్డుపై పడిన గుంతలను పోలీసులు బుధవారం పూడ్చివేయించారు. ఎన్ఎస్ గేట్ నుంచి ధర్మవరం వెళ్లే రహదారిలో రోడ్డుపై నిర్మించిన కల్వర్టుకు ఇరువైపులా గుంతలు పడ్డాయి. ఇది మలుపు వద్ద ఉండటంతో తరచూ ప్రమాదాలు జరిగేవి. విషయం తెలుసుకున్న చెన్నేకొత్తపల్లి ఎస్ఐ సత్యనారాయణ సిబ్బందితో కలసి రోడ్డును పరిశీలించారు. జేసీబీ సాయంతో గుంతలను పూడ్చివేయించేందుకు చర్యలు తీసుకున్నారు. గుంతల్లో మట్టి వేసి పూడ్చటంతో వాహనదారులు పోలీసులను అభినందించారు.

IN THE COURT OF THE PRL. SENIOR CIVIL JUDGE. ANANTAPURAMU

S.O.P. No. 15/2024

Between :
1. M. Babajan 2. M. Nisar Ahamed
3. M. Haseena Begum ... Petitioner
V/s
Nil ... Respondant

ప్రకటన

పై నెంబరులోని పిటీషనర్లు వీరి తల్లి అయిన శ్రీమతి యం. నూర్జహాన్ బేగం భర్త లేట్ నజీర్ అహమ్మద్ పెన్షనర్ అయిన ఈమె 07-04-2018 తేదీన మరణించినందున పై తెల్పిన పిటీషనర్లు తాము ఆమె వారసులమని, ఆమెకు రావలసినటువంటి రూ. 70,200/- PPONo. GR/CDP/15106 రిటన్ క్యాపిటల్‌గా ఉన్నటువంటి డబ్బు కొరకు క్రింది షెడ్యూలు దాఖలా మొత్తం కొరకు హక్కుదారులమని వారసత్వపు సర్టిఫికేట్ ఇవ్వవలసిందిగా పై కోర్టు నందు అర్జీదాఖలు చేసినారు. అందుకు ఎవరికైనా ఎలాంటి ఆక్షేపణలున్న యెడల 26-12-2024వ తేదీన స్వయముగా గాని లేక వకీలు ద్వారా గానీ హాజరు కావలయును లేని యెడల పై కేసును అర్జీదారుల పరంగా తీర్మానించబడునని తెలియజేయడమైనది.

షెడ్యూలు

PPO No. GR/CDP/15106 Return of Capital (ROC) Rs. 70,200/- Total Claim of Rs. 70,200/- (Rupees Seventy thousand two hundred only) is lying with regional PF Commissioner II (Pension) Kadapa which is belongs to deceased Smt. M. Noorjahan Begum

(కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)

Rachamalla Yerri Swamy, B.A., B.L.
Advocate, ANANTAPUR.